క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సవాసప్పతాత ఉరుసు


చెన్నంపల్లిలో షంషేర్‌ను ఊరేగిస్తున్న దృశ్యం

తుగ్గలి: మండల పరిధిలోని చెన్నంపల్లిలో సవాసప్పతాత ఉరుసు ఉత్సవాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కులమతాలకతీతంగా భక్తులు దర్గాను దర్శించుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం తెల్లవారుజామున ముజావర్లు పూలతో అలంకరించిన స్వామి షంషేర్‌ను గుర్రంపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు చేశారు. గ్రామస్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి తమ కోర్కెలు నెరవేరాలని మొక్కుకున్నారు.

23 నుంచి సుంకులమ్మ దేవర


రాతనలో వెలసిన సుంకులమ్మ

తుగ్గలి: మండల పరిధిలోని రాతనలో వెలసిన సుంకులమ్మ అవ్వ దేవర ఉత్సవాలు ఈనెల 23 నుంచి రెండు రోజులు పాటు ఘనంగా నిర్వహించనున్నారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, బుధవారం మహిళలు బోనాలు సమర్పిస్తారని గ్రామస్తులు తెలిపారు. దేవర ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

వాల్మీకులను ఎస్టీలో చేర్చాలి


రిలే నిరహార దీక్షలో పాల్గొన్న వాల్మీకులు

ఆలూరు: వాల్మీకుల రిజర్వేషన్లలో ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించాలని ఏపీ వాల్మీకి బోయ సంఘం (ఏపీవీబీఎస్) జిల్లా అధ్యక్షుడు ఎల్లార్తి అర్జున్ డిమాండ్ చేశారు. ఆలూరులోని అంబేడ్కర్ సర్కిల్ ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరారు. వాల్మీకుల దీక్షలు ఆదివారం నాలుగో రోజుకు చేరాయి. వివిధ గ్రామాల నాయకులు వీరేష్ మల్లికార్జున, పులి మల్లయ్య, శ్రీను, మహేష్ తదితరులు దీక్షకు మద్దతు తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న పూజారి

హొళగుంద: జిల్లాలో దసరా ఉత్సవాలకు ప్రత్యేకత చాటుకున్న దేవరగట్టులో ఆదివారం స్వామి వారాన్ని పురస్కరించుకుని మాళ మల్లేశ్వరస్వామికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పూజారి మనోహర్ స్వామి ఆలయంలోని మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాత సేవ, అభిషేకాలు, రుద్రాభిషేకం, బండరార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, నైవేద్య సంతర్పణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు భారీగా తరలి రాగా వారికి పూజారులు తీర్థ ప్రసాదాలను అందించారు. అలాగే ఆలయ కమిటీ చైర్మన్ గుమ్మనూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వాహకులు అన్నదానం చేశారు.

అనారోగ్యంతో అర్చకుడి మృతి

పత్తికొండ రూరల్: పత్తికొండలోని బ్రాహ్మణ వీధిలో నివాసం ఉంటున్న ప్రముఖ అర్చకుడు గుండాచార్యులు (72) ఆదివారం నెల్లూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పత్తికొండ జెడ్పీ బాలికల హైస్కూల్‌లో క్లర్క్‌గా, తుగ్గలి ఎంపీడీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి కొన్నేళ్ల కిందట పదవీ విరమణ పొందారు. ఆలయంలో అర్చకుడిగా ఉంటూ పురోహిత్యం చేస్తుండేవారు. కొన్నాళ్ల క్రిందట అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

గోనెగండ్ల: మద్యం తాగి వాహనం డ్రైవింగ్ చేస్తే చర్యలు తప్పవని ఎస్ఐ తిమ్మారెడ్డి హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఆయన పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. డ్రైవింగ్ లైసెన్ లేకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడం, వాహన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు.

నాడు కరెంటు కోతలు.. నేడు విద్యుత్ వెలుగులు

- లో-ఓల్టేజీ సమస్యకు చెక్
- చిట్యాల వద్ద రూ.3.5 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు
- హంద్రీ – నీవా కాలువతో పెరిగిన భూగర్భ జలాలు
- ఏడాదికేడాది పెరుగుతున్న విద్యుత్ వాడకం
- రైతుల సమస్యలకు పరిష్కారం చూపిన ప్రభుత్వం
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు


డిసెంబర్ 29న చిట్యాలలో సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే శ్రీదేవి తదితరులు (ఫైల్)



కృష్ణగిరి: గత టీడీపీ హయాంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. ఉన్న కొన్ని సబ్‌స్టేషన్ల ద్వారా వచ్చే లోడు సరిపోక రైతులు, గృహ వినియోగదారులు లో-ఓల్టేజీతో అవస్థలు పడ్డారు. అయితే వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయం, గృహ అవసరాలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అవసరాలకు తగ్గట్టుగా సబ్‌స్టేషన్లు ఏర్పాటు ఏర్పాటు చేయిస్తూ అప్రకటిత విద్యుత్ కోతలు, లో-ఓల్టేజీ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపుతున్నారు. రైతులకు పగటిపూట 9 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా జరిగేలా చూస్తున్నారు. దీంతో వ్యవసాయం రంగం, ఉద్యాన రంగం శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి.

సేద్యం 'పవర్' ఫుల్..

గత పాలనలో వ్యవసాయం చేయాలంటే అదో యుద్ధం. విద్యుత్ కనెక్షన్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ మంజూరుకు, లైన్ ఏర్పాటు వరకు ఏళ్ల తరబడి ఎదురు చూడాల్సి వచ్చేది. ప్రస్తుత ప్రభుత్వం ఆ కష్టాలకు చెక్ పెట్టింది. అంతేకాదు రైతు కనెక్షన్ కోసం వినియోగించే విద్యుత్ హార్స్‌పవర్‌కు చెల్లించే డిపాజిట్ మినహాయిస్తే అంతా ఉచితమే. సేద్యానికి ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్న ప్రభుత్వం రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, కనెక్షన్లు, లైన్ ఏర్పాటు, దానికి అవసరమైన మెటీరియల్ కూడా పూర్తి ఉచితంగా అందిస్తోంది. ఫలితంగా రైతు ఏళ్ల నిరీక్షణ స్వస్తి పలికి అడిగిన వెంటనే కనెక్షన్ ఇచ్చే స్థితికి తీసుకొచ్చింది.


చిట్యాలలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్

గతంలో తీవ్రమైన సమస్య

కృష్ణగిరి మండలంలో అత్యధికంగా హంద్రీ-నీవా సుజల స్రవంతి కాలువ ఆయకట్టు ఉంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ చొరవతో ఇక్కడి రైతులు వ్యవసాయంలో రాణిస్తున్నారు. ప్రతేడాది కాలువ నీరు రావడంతో ఇక్కడి భూగర్భజలాలు పెరిగి అన్నదాతలు బోరు, బావుల ద్వారా పంటలు పండిస్తున్నారు. మండల పరిధిలోని చిట్యాల, కోయిలకొండ, చుంచుఎర్రగుడి గ్రామాల్లో ఏడాదికేడాది ఉద్యాన పంటల సాగు పెరుగుతోంది. దీంతో బోరు, బావుల సంఖ్య పెరగడంతో ఉన్న సబ్‌స్టేషన్లపై లోడు అధికమై నిత్యం కరెంటు కష్టాలతో రైతులు విసిగిపోయారు. ఇక్కడి నాయకులు లో-ఓల్టేజీ సమస్యను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లారు.

రూ.5 కోట్లతో సబ్‌స్టేషన్ ఏర్పాటు

కృష్ణగిరి మండల పరిధిలోని చిట్యాల తదితర గ్రామాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గతేడాది మార్చిలో నూతన సబ్‌స్టేషన్ ఏర్పాటుకు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. కేవలం ఏడు నెలల్లోనే పనులు పూర్తిచేసి ఇటీవల సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. చిట్యాల, కోయిలకొండ, చుంచుఎర్రగుడి, పెద్దొడ్డి తదితర గ్రామాల్లో దాదాపుగా 850 వ్యవసాయ కనెక్షన్లకు ఈ సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ అందిస్తున్నారు. రూ.3.5 కోట్లతో ఏర్పాటు చేసిన 5 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. మరో నెల రోజుల్లో అదనంగా రూ. 1.5 కోట్లతో మరో 5 మెగావాట్ల ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తుండటంతో భవిష్యత్తులో మరో పదేళ్ల వరకు విద్యుత్ సమస్య తలెత్తదని విద్యుత్ అధికారులు తెలియజేశారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా



మా గ్రామానికి అనుకుని హంద్రీ-నీవా ప్రధాన కాలువ వెళుతుంది. కాలువలో ఏటా నీరు వస్తుండడంతో ఇక్కడి పొలాల్లో భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు వలసలు వెళ్లకుండా ప్రతిఒక్కరు బోరు, బావులు ద్వారా పంటలు పండిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్లు పెరగడంతో లో-ఓల్టేజీ సమస్య ఎక్కువైంది. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి చొరవ తీసుకుని విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించడంతో సమస్య తీరింది. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవుతోంది.

– చిన్న మాదన్న, రైతు, చిట్యాల

ఆనందంగా ఉంది



మా గ్రామంలో విద్యుత్ సమస్య గత కొన్నేళ్లుగా ఉంది. అయితే అప్పటి పాలకులు పట్టించుకోలేదు. రోజురోజుకు ఉద్యాన పంటలు పెరుగుతుండటంతో రైతులు పడుతున్న కష్టాలను ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి దృష్టికి తీసుకెళ్లాం. వారు స్పందించి ఉన్నతాధికారుల ద్వారా ఆరు నెలల్లోనే సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం వ్యవసాయానికి నిరంతరాయంగా 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. గత పాలకులు చేయలేని పనిని మా ప్రభుత్వంలో చేసి చూపడం ఆనందంగా ఉంది.

– సుధాకర్ రెడ్డి, కోయిలకొండ సహకార సొసైటీ చైర్మన్, చిట్యాల

రైతు సంక్షేమానికి పెద్దపీట



రైతు సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారు. అవసరమైన ప్రతి చోట విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు శ్రీకారం చుట్టారు. కృష్ణగిరి మండల పరిధిలో మరిన్ని సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాం. ఎక్కడా విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకుండా చర్యలు చేపట్టాం. టీడీపీ హయంలో రైతులు, ప్రజలు అష్టకష్టాలు పడ్డారు. ఉచిత విద్యుత్‌పై చంద్రబాబు అవహేళనగా మాట్లాడారు. కేఈ కృష్ణమూర్తి డిప్యూటీ సీఎంగా ఉన్నా విద్యుత్ సమస్యకు పరిష్కారం చూపలేదు. సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమైందంటూ ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– కంగాటి శ్రీదేవి, పత్తికొండ ఎమ్మెల్యే

రామాలయాల ముస్తాబు

వెల్దుర్తి(కృష్ణగిరి): అయోధ్యలో సోమవారం రామ మందిర ప్రారంభోత్సవం, బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా వెల్దుర్తి మెయిన్ బజారులోని శ్రీరాములవారి దేవాలయంలో ప్రత్యేక పూజలకు, ఉత్సవ మూర్తుల గ్రామోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పెద్దలు తెలిపారు. అలాగే స్థానిక హైవే 44 పక్కన కర్నూలు రోడ్డులో వెలసిన 51 అడుగుల భారీ అభయాంజనేయ స్వామి పాదాల చెంత దాత వెల్దుర్తి వడ్డె చిరంజీవి చేతులమీదుగా అఖండ దీపం ఏర్పాటు చేయనున్నారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి రామాలయాల్లో సీతారాములకు అభిషేకం, ఆకుపూజ కార్యక్రమాలు చేయనున్నారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఉంటుందని అర్చకులు తెలిపారు.

తుగ్గలి: మండలంలోని జొన్నగిరి, తుగ్గలి, పెండేకల్లు, పీ.కొత్తూరు, రాతన, జీ.ఎర్రగుడి, ఉప్పర్లపల్లి తదితర గ్రామాల్లోని రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాలను ప్రత్యేకంగా అలకరించారు. సోమవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

10న డీటీఎఫ్ రజతోత్సవ సభలు



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప

ఎమ్మిగనూరుటౌన్: డీటీఎఫ్ సంఘం ఏర్పడి 25 సంవత్సరాలు అవుతున్నందున ఫిబ్రవరి 10, 11 తేదీల్లో విశాఖపట్టణంలోని ఉత్తరాంధ్ర ప్రేమ సమాజం ఆడిటోరియం దాభా గార్డెన్స్‌లో డీటీఎఫ్ రజతోత్సవ మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప పేర్కొన్నారు. ఆదివారం స్థానిక డీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. పాతికేళ్ల ఉపాధ్యాయ ఉద్యమంలోనూ, సామాజిక ఉద్యమాల్లోను డీటీఎఫ్ ప్రత్యేక స్థానం సంపాదించుకొందన్నారు. రజతోత్సవ సభలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. డీటీఎఫ్ నాయకులు రత్నం ఏసేపు, నాయకులు వెంకట్రాముడు, రామన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా కులగణన సర్వే


హొళగుందలో సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్

తుగ్గలి: మండలంలో రెండోరోజు కులగణన సర్వే చురుగ్గా సాగుతోంది. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి సర్వే వివరాలు నమోదు చేస్తున్నారు. మండలంలో మొత్తం 18 గ్రామ సచివాలయాల పరిధిలో 20,395 కుటుంబాలు ఉన్నాయి. సర్వేలో రెండోరోజు ఆదివారం సాయంత్రానికి 3,026 కుటుంబాల్లోని 6,638 మంది సభ్యులను సర్వే చేసి వారి కులాల వివరాలను నమోదు చేసినట్లు ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ గోపాల్ తెలిపారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

హొళగుంద: మండలంలోని ఆయా గ్రామాలలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో యజమాని, వలంటీరు వేలిముద్రలను అప్‌లోడ్ చేస్తున్నారు. యాప్‌లో వివరాల నమోదు పనిని వేగవంతం చేసినట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ తెలిపారు. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని సర్వేను వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

హాలహర్వి: మండలంలోని బిలేహాల్, సిద్ధాపురం, గూళ్యం, నిట్రవట్టి తదితర గ్రామాల్లో ఆదివారం కులగణన సర్వే కొనసాగింది. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కులగణన వివరాలను నమోదు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేకు ప్రజల నుంచి సరైన స్పందన లభిస్తోంది.

వెల్దుర్తి(కృష్ణగిరి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే ఆదివారం సెలవురోజూ కొనసాగింది. మండల వ్యాప్తంగా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు తమకు కేటాయించిన ఇళ్ల వద్దకు వెళ్లి కుటుంబసభ్యుల వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. 30 శాతం సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

బొలెరో వాహనం బోల్తా


హులేబీడు సమీపంలో బోల్తాపడిన బొలెరో వాహనం

ఆలూరు రూరల్: మిరప లోడుతో వెళ్తున్న బొలెరో వాహనం టైరు పంచర్ కావడంతో అదుపుతప్పి బోల్తాపడింది. వివరాలు.. కౌతాళం మండలం కామవరం గ్రామానికి చెందిన రైతులు మిరప దిగుబడులు విక్రయించేందుకు కర్ణాటక రాష్ట్రం బ్యాడిగికి వెళ్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆలూరు మండలంలోని హులేబీడు గ్రామం సమీపంలో వెళుతుండగా బొలెరో టైరు పంచర్ కావడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో రమేష్, వీరన్న అనే రైతులకు గాయాలయ్యాయి. గ్రామస్తులు 108 వాహనానికి సమాచారం అందించడంతో ఆలూరు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన చికిత్స కోసం ఆదోని ఆస్పత్రికి రెఫర్ చేశారు.

27 నుంచి ఫుట్‌బాల్ టోర్నీ


టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: నీలకంఠేశ్వరస్వామి జాతర మహోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 27వ తేదీ నుంచి వైఎస్సార్ అంతర్రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆదివారం టోర్నమెంట్ ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. ఆర్గనైజర్లు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, విశ్వనాథ్‌రమేష్ మాట్లాడారు. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్ మోహన్ రెడ్డి సహకారంతో నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.1,00,116, ద్వితీయ బహుమతి రూ.50,116, తృతీయ బహుమతి రూ.20,116 ప్రదానం చేయడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.1000 ఎంట్రీ ఫీజు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ నెంబర్ 94408 64732, 94904 85159 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు సచివాలయం, ఆర్‌బీకే ప్రారంభోత్సవం





టి.గోకులపాడులో ప్రారంభోత్సవానికి సిద్ధమైన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనం

కృష్ణగిరి: మండల పరిధిలోని టి.గోకులపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయంను సోమవారం సాయంత్రం ప్రారంభిస్తున్నట్లు పీఆర్ ఏఈ అబ్దుల్‌వహీద్ సాహెబ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా ఈ భవనాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ మండల కన్వీనర్ ఆర్‌బీ వెంకటరాముడు కోరారు.

రామయ్య వేడుకకు వేళాయె


శ్రీరామ చిత్రపటం ఊరేగింపులో కోలాటం ప్రదర్శన


రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం

మద్దికెర: అయోధ్యలో సోమవారం శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం పురస్కరించుకొని ఆదివారం స్థానిక కోదండ రామస్వామి ఆలయం నుంచి రాంనగర్‌లోని రామస్వామి ఆలయం వరకు అయోధ్యరాముడి చిత్రపటాన్ని ఘనంగా ఊరేగించారు. ముందుగా ఆలయంలో సీతారామలక్ష్మణుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఊరేగింపు కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. గ్రామంలో వీధులన్నీ కాషాయం జెండాలతో అలంకరించారు. ఊరేగింపులో మహిళల కోలాట నృత్యాలు అందరినీ ఆకర్షించాయి.

శ్రీరాముడు ప్రతిష్ఠించిన శివలింగం

ఆస్పరి: ఆస్పరి సమీపంలో శ్రీరాముడు నడియాడిన నేల రామతీర్థంను భక్తులు పవిత్ర పుణ్యక్షేత్రంగా భక్తులు కొలుస్తున్నారు. త్రేతాయుగంలో శ్రీరాముడు అరణ్యవాసంలో భాగంగా ఈ ప్రాంతంలో ఒక రోజు నిద్రించాడని పురాణాలు చెబుతున్నాయి. శ్రీరాముడు పూజ చేసేందుకు ఇక్కడ శివలింగాన్ని ప్రతిష్ఠించాడని అభిషేకం చేసేందుకు జలం లేక పోవడంతో బాణం సంధించగా కొలను ఏర్పాటైందని ప్రతీతి. ఆ నీటితో శివుడికి అభిషేకం చేయడం వల్ల ఈప్రాంతానికి రామతీర్థంగా పేరు వచ్చింది. ఆ తరువాత శ్రీ కృష్ణదేవరాయల కాలంలో ఇక్కడ ఆలయాన్ని నిర్మించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినా ఈ కొలనులో మాత్రం నీరు ఉంటుంది.

నేడు ప్రత్యేక పూజలు: అయోధ్య రామమందిరంలో శ్రీరాముడు కొలువుదీరనున్న సందర్భంగా శ్రీరాముడు నడియాడిన నేల రామతీర్థంలో సోమవారం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అలాగే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు చెప్పారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


శిబిరంలో కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

పత్తికొండటౌన్: తమ పరిధిలో ప్రజలకు సేవలందించేందుకు అంకితం అవుతామని కేడీసీసీ మాజీ వైస్‌చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ ఎస్.నాగరత్నమ్మ అన్నారు. వారి సహకారంతో ఆదివారం స్థానిక సాయిబాబా దేవాలయం ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. శాంతిరాం ఆస్పత్రి నుంచి వైద్యులు డాక్టర్ సురేష్, డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది శిబిరానికి హాజరైన వారికి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి దంపతులు మాట్లాడుతూ.. గత ఆరేళ్ల నుంచి ఇప్పటివరకు 5 వేల మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేయించినట్లు తెలిపారు. అడ్వకేట్ దామోదరాచారి, వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్ము నెట్టేకల్లు, శ్రీకాంత్‌రెడ్డి, పాలబాషా, సుంకన్న, టైలర్ రంగన్న, రామాంజనేయులు, గుండు మహమ్మద్ పాల్గొన్నారు.

విప్లవ వీరుడు లెనిన్ శత వర్ధంతి



పత్తికొండలో లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు


ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఆదివారం పలు సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమ విప్లవ వీరుడు ఐవి లెనిన్ శత వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో లెనిన్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపణ్ణగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం కార్యదర్శి భాస్కర్‌యాదవ్ తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు జీవుల కోసం లెనిన్ చేసిన పోరాటాల గురించి వివరించారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ సంఘ కార్యాలయంలో లెనిన్ చిత్రపటానికి నాయకులు రాజు, ప్రసాద్ నివాళులర్పించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): సోషలిస్టు రష్యా విప్లవ నాయకుడు లెనిన్ శత వర్ధంతి పురస్కరించుకుని స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి టి.కృష్ణ, ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు మాధవస్వామి, సీపీఐ, అనుబంధ సంఘాల నాయకులు రాజు, చిన్నమాదులు, అనిల్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండ రూరల్: విప్లవ నాయకుడు కామ్రేడ్ లెనిన్ శత వర్ధంతిని సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. స్థానిక చదువుల రామయ్య భవన్ నుంచి నాలుగు స్తంభాల కూడలి వరకు ర్యాలీగా చేరుకోగా అక్కడ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి రాజా సాహెబ్, నాయకులు పాల్గొన్నారు.


గతుకుల దారిలో సీసీ రోడ్డు


నాడు - గతుకులమయంగా ఉన్న రోడ్డు


నేడు - రూ.3.70 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు

మద్దికెర: ప్రధాన బజారు నుంచి చాకలి వీధికి వెళ్లే దారిలో ఎన్నో ఏళ్లుగా రోడ్డు కావాలని అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. నిత్యం రాళ్లురప్పలు తేలిన మార్గంలో రాకపోకలు సాగిస్తూ ప్రజలు అవస్థలు పడ్డారు. రోడ్డు కోసం ప్రతి నాయకుడినీ అడిగినా పట్టించుకున్న పాపాన పోలేదు. అయితే 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవిని స్థానికులు రోడ్డు సమస్య పరిష్కరించాలని కోరారు. సత్వర చర్యలు చేపట్టిన ఆమె సచివాలయ నిధులతో వెంటనే రోడ్డు నిర్మించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో టైలర్ హరి ఇంటి నుంచి చాకలి సంజప్ప ఇంటి వరకు రూ.3.70 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించడంతో ఆ కాలనీ వాసులు హర్షం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూలనపడ్డ ట్రైసైకిళ్లు


నిరుపయోగంగా పడిఉన్న చెత్త తరలించే ట్రైసైకిళ్లు

హొళగుంద: పారిశుద్ధ్య నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయానికి తూట్లు పడుతున్నాయి. వీధుల్లో తడి చెత్త, పొడి చెత్తను తరలించేందుకు ప్రభుత్వం పంచాయతీలకు పంపిణీ చేసిన ట్రై సైకిళ్లు హొళగుంద సమీపంలోని బళ్లారి రోడ్డు పక్కనున్న ఓ పొలంలో నిరుపయోగంగా పడిఉన్నాయి. నిర్వహణ లేక తుప్పు పట్టి విడి భాగాలు చోరీకి గురవుతున్నాయి. పంచాయతీల వారీగా మంజూరైన ఈ సైకిళ్లను వినియోగించుకోకుండా మూలన పడేసినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

క్రీడా సామగ్రి పంపిణీ


క్రీడాకారులకు కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

గోనెగండ్ల: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల నైపుణ్యం వెలికితీసేందుకు ప్రభుత్వం 'ఆడుదాం – ఆంధ్ర' క్రీడాపోటీలను నిర్వహిస్తోందని ఈఓఆర్డీ నాగేష్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఆదివారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు.. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ప్రభుత్వం పంపిణీ చేసిన క్రీడా సామగ్రి క్రికెట్ బ్యాట్లు, టీషర్ట్స్, టోపీలను అందజేశారు. ఈ సందర్భంగా ఈఓఆర్డీ నాగేష్ మాట్లాడుతూ మండలస్థాయిలో గెలిచి తాలూకా స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ప్రభుత్వం క్రీడా సామగ్రి పంపిణీ చేసిందన్నారు. తాలూకా స్థాయి పోటీలు ఈ నెల 24వ తేదీ నుంచి జరుగుతాయన్నారు. క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఓ బాబుభాస్కర్, ఈఓ సతీష్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.